
బాపూజీనగర్‌లో రోడ్డుపై ఏరులై పారుతున్న వర్షపు నీరు


రాంనగర్‌లో భారీ వర్షం


వివేక్‌నగర్ శ్రీఆంజనేయస్వామి దేవాలయం వద్ద..

వర్ష బీభత్సం..

జనజీవనం అస్తవ్యస్తం

• విరిగి పడిన చెట్ల కొమ్మలు • విద్యుత్ సరఫరాకు అంతరాయం
• ఎక్కడికక్కడ నిలిచిపోయిన వాహనాలు

ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో గురువారం మధ్యాహ్నం నుంచి కురిసిన వర్షానికి జనజీవనం అస్తవ్యస్తం అయ్యింది. ఈదురు గాలులకు చెట్లు, పలు ప్రాంతాల్లో వృక్షాలు నేలకొరిగాయి. ఈ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడం ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఇక లోతట్టు ప్రాంతాలు విషయం చెప్పనవసరం లేదు. చాలా ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. తీవ్ర ట్రాఫిక్ జామ్‌తో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.


చెరువును తలపిస్తున్న ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం

నల్లకుంట: నల్లకుంటలో గురువారం సాయంత్రం ఈదురు గాలులతో కురిసిన భారీ వర్షానికి వీధులు జలమయమై, జనజీవనం అస్తవ్యస్తమైంది.

◆ నల్లకుంట స్ట్రీట్ నం.7లోని ఓ ఇంటి ఆవరణలో ఉన్న ఓ చెట్టు కొమ్మలు విరిగి పక్కనే ఉన్న హై టెన్షన్ విద్యుత్ తీగలపై పడ్డాయి. దీంతో ఒక్కసారిగా మెరుపులు భారీ శబ్దం వచ్చింది. దీంతో అప్రమత్తమైన స్థానికులు వెంటనే జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అదించారు. విద్యుత్ శాఖ అధికారులు ఆ పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఎన్‌డీఆర్ఎఫ్ బృందం విరిగి పడిన చెట్టు కొమ్మలను తొలగించారు. అనంతరం విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. సుమారు రెండు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇంటి ఆవరణలో ఉన్న చెట్ల కొమ్మలు ఏపుగా పెరిగితే హార్టికల్చర్ విభాగం అధికారులకు సమాచారం ఇవ్వాలని అధికారులు కోరారు.

◆ చిక్కడపల్లి: ఉరుములు మెరుపులతో కురిసిన భారీ వర్షానికి ఆర్టీసీ క్రాస్‌రోడ్డు, దోమలగూడ, రాంనగర్, బోలక్‌పూర్, రాంనగర్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హుస్సేన్‌సాగర్ నాలా వెంబడి ఉన్న సబర్మతినగర్, అరుంధతీనగర్, బాపూనవగర్, దోబీఘాట్, లేబర్ కార్యాలయం, త్యాగరాయగాన సభ సందీవయ్యనగర్ బస్తీ రోడ్లపై వర్షపు నీరు ఏరులై పారింది. ఆటోలు, కార్లు, బస్సులు, వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి.

ముషీరాబాద్‌లో భారీ వర్షం

ముషీరాబాద్: గురువారం కురిసిన భారీ వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీనగర్, ప్రేయర్ పవర్ చర్చి వీధి, బాప్టిస్ట్ చర్చి వీధి, పార్శిగుట్ట చౌరస్తా, రాజా డీలక్స్ చౌరస్తా వద్ద వరద నీరు రోడ్లపై మోకాలి లోతు వరకు నీరు నిలిచిపోయింది. అక్కడ ఇళ్లలోకి సైతం వర్షపు నీరు చేరింది.

◆ భోలక్‌పూర్ రంగానగర్‌లోని మల్లేష్ నివాసం ఉంటున్న మూడో అంతస్తులో భారీ వర్షానికి పై కప్పు పెచ్చులు ఊడి కిందపడ్డాయి. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. భోలక్‌పూర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు, రంగానగర్ బస్తీ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు ఈ విషయాన్ని ఎమ్మెల్యే ముఠా గోపాల్ దృష్టికి తీసుకెళ్లి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

◆ బాపూజీనగర్‌లో పురాతన భవనం గోడలు, శ్లాబ్‌లు కూలిపోవడంతో ముషీరాబాద్ నియోజకవర్గ బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు కంచిముదిరాజ్ ఘటన స్థలానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో వర్షపు నీరు నిలిచిపోవడంతో చెరువును తలపించింది.

కొట్టుకుపోతున్న వాహనాదారుడిని కాపాడిన స్థానికులు..



చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతినగర్ సీఎస్‌బీ ఐఏఎస్ అకాడమీ వద్ద భారీ వర్షానికి వాహనాదారుడు కిందపడి కొట్టుకుపోతుండగా వాహనాదారుడిని గురువారం సాయంత్రం స్థానికులు కాపాడిన సంఘటన జరిగింది. విషయం తెలుసుకున్న జీహెచ్ఎంసీ, శానిటేషన్ సిబ్బందిని గాంధీనగర్ కార్పొరేటర్ పావని అప్రమత్తం చేశారు. విరిగిపడిన చెట్లకొమ్మలు, విద్యుత్ వైర్లను సిబ్బంది తొలగించారు. అంతేకాకుండా బస్తీ అధ్యక్షుడు మెరుగు శ్రీనివాస్‌యాదవ్, గుండెల్లి రవీందర్‌యాదవ్ కూడా ఇక్కడ సహాయక చర్యలు చేపట్టారు.


నల్లకుంట స్ట్రీట్ నం.7లో విద్యుత్ తీగలపై పడిన చెట్ల కొమ్మలు


చెట్ల కొమ్మలను తొలగిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బంది


లేబర్ కార్యాలయం నుంచి త్యాగరాయ గానసభ వెళ్లే రోడ్డులో..


మోహన్‌నగర్‌లో కారుపై విరిగి పడ్డ చెట్ల కొమ్మలు


బాపూజీనగర్‌లో కూలిన శ్లాబ్‌ను పరిశీలిస్తున్న బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్‌కుమార్

కార్మికుల హక్కులు కాపాడేది ఐఎన్‌టీయూసీ ఒక్కటే..

కాచిగూడ: భారత ప్రధాని నరేంద్రమోదీ తీసుకొచ్చిన కొత్త కార్మిక చట్టాలు కార్మికుల ప్రాథమిక హక్కులను హరించేవని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ జి.సంజీవరెడ్డి అన్నారు. ఈ కొత్త కార్మిక చట్టాలలో మార్పులు కార్మిక సంఘాల ఉద్యమంపై కొత్త ఒత్తిళ్లను తెస్తున్నాయని, బలమైన పోరాటాలతో ఈ ఒత్తిళ్లను ఎదుర్కోవాలని ఆయన పిలుపునిచ్చారు. గురువారం బర్కత్‌పురలోని సంజీవరెడ్డి నివాసంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ప్రధానకార్యదర్శి ఆర్‌డీ చంద్రశేఖర్ అధ్యక్షతన ఐఎన్‌టీయూసీ ముఖ్యనేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 4 కోడ్‌లుగా తీసుకొచ్చిన ఈ నూతన కార్మిక చట్టాలు అంతర్జాతీయ కార్మిక ప్రమాణాలను ఉల్లంఘించేలా ఉన్నాయని పేర్కొన్నారు. కార్మికుల హక్కులు కాపాడేది ఐఎన్‌టీయూసీ ఒక్కటేనని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నేతలు వై.నాగన్నగౌడ్, ఎల్‌డీ పాల్, కె.రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి


మణెమ్మ గల్లీలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: రాంనగర్ మణమ్మ గల్లీలో డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మణెమ్మ గల్లీలో కొనసాగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... మణెమ్మ గల్లీలో దీర్ఘకాలికంగా నెలకొన్న డ్రైనేజీ సమస్యను నూతనంగా ఏర్పాటు చేస్తున్న పైపలైన్ నిర్మాణంతో పరిష్కారం కావాలన్నారు. మిగిలిన సమస్యకు కూడా పరిశీలిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, బల్ల శ్రీనివాస్‌రెడ్డి, కె.సురేందర్, కె.మాధవ్, శ్యాంసుందర్ చిట్ట, నేతా శ్రీనివాస్, ధర్మ, శంకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలల ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం


పురస్కారాలు అందుకున్న బాలలతో నరసింహప్ప, ఎంకే రాము

చిక్కడపల్లి: పిల్లల్లో ప్రతిభను గుర్తించి సత్కరించి భవిష్యత్‌లో ఉన్నతంగా రాణించేలా ప్రోత్సహించాలని ఆదాయపన్ను శాఖ విశ్రాంత కమిషనర్ ఎం.నరసింహప్ప అన్నారు. ప్రముఖ సాంస్కృతిక సంస్థ రసమయి ఆధ్వర్యంలో విశ్వావసు నామ ఉగాదిని పురస్కరించుకొని ఆదివారం త్యాగరాయ గానసభలో నిర్వహించిన రసమయి బాలల ఉగాది పురస్కారాల ప్రదానోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. పిల్లల్లో సృజనాత్మక శక్తిని ప్రోత్సహించాలన్నారు. ఈ సందర్భంగా ఎంపిక చేసిన పలువురు బాలలకు పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు డాక్టర్ ఎంకే రాము, పండిట్ అంజుబాబు, ఏపీ మైన్స్ పూర్వ డైరెక్టర్ వీడీ రాజగోపాల్, శ్రీనివాస్‌లు, ఆశాలత, బాలలు మధులిత, శాన్విశ్రీ, జి.ఆరాధ్య టి.కల్పితరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షక రంజకంగా శాస్త్రీయ సంగీత కచేరి

చిక్కడపల్లి: కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో పుచ్చా వెంకటరామశాస్త్రి త్యాగరాయ గానసభలో గురువారం రాత్రి నిర్వహించిన 'సంగీతానంద లహరీ.. ఆనంద విలాసం' శీర్షికతో నిర్వహించిన శాస్త్రీయ సంగీత కచేరి ప్రేక్షక రంజకంగా సాగింది. ఈ సందర్భంగా నిన్నుకోరియున్నానురా, మహాగణపతి మనసా స్మరామి, సామజవరగమనా, అదిగో అల్లదివో వంటి గీతాలను శ్రావ్యంగా ఆలపించి ఆకట్టుకున్నారు. అనంతరం వెంకటరామశాస్త్రిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు మద్దాళి రఘురాం, మల్లికార్జున్, అనంతశౌరిరాజన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమి శోభాయాత్రను విజయవంతం చేయండి



కాచిగూడ: శ్రీరామనవమి పండుగను పురస్కరించుకుని ఈ నెల 6వ తేదీన అంబర్‌పేట జీహెచ్ఎంసీ మున్సిపల్ గ్రౌండ్స్ నుంచి కాచిగూడ వీరసావర్కర్ విగ్రహం వరకు నిర్వహించనున్న శ్రీరామనవమి శోభాయాత్రను విజయవంతం చేయాలని కార్పొరేటర్ ఉమా కోరారు. గురువారం కార్పొరేటర్ మహిళలకు ఆహ్వాన పత్రికలను అందజేశారు.

విద్యార్థుల అక్రమ అరెస్టులను ఖండిస్తున్నాం

ముషీరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాల భూమిని కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేయడానికి పూనుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మంద నవీన్, కంచనపల్లి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. విపక్ష విద్యార్థి సంఘా పీడీఎస్‌యూ, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ(వీ), ఏఐడీఎస్‌ఓల ఆధ్వర్యంలో నిరసన తెలపాలన్నారు. పర్యావరణాన్ని కాపాడుతూ అక్కడున్న వన్యప్రాణులను సంరక్షించే బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గత నెల 13వ తేదీ ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఎలాంటి ధర్నాలు, రాస్తారోకోలు, నినాదాలు చేయకూడదని ఈ కాంగ్రెస్ ప్రభుత్వమే వీసీ, రిజిస్ట్రార్‌లతో ఒక నియంతృత్వ సర్క్యులర్‌ను జారీ చేయించారన్నారు. ఈ రెండిటిని తక్షణమే ఉపసంహరించుకోవాలని లేకుంటే సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. అరెస్టు చేసిన విద్యార్థి సంఘాల నేతలను బేషరత్తుగా విడుదల చేయాలన్నారు.

కళా దీక్షితులు స్మారక పురస్కారం ప్రదానోత్సవం


ఉప్పాల సతీష్‌బాబు, సీహెచ్‌వీ ప్రసాద్‌కు పురస్కారం ప్రదానం చేస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి

చిక్కడపల్లి: వర్ధమాన కళాకారులకు వేదికలకు ఇస్తూ కళా వెంకట దీక్షితులు ఎంతో ప్రోత్సహించారని శాసనసభ ప్రతిపక్ష నాయకులు, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి అన్నారు. గురువారం సాయంత్రం త్యాగరాయ గానసభ నిర్వహణలో గానసభ పూర్వ అధ్యక్షుడు డాక్టర్ కళా వెంకట దీక్షితులు జయంతి కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ఈ సందర్భంగా సాంస్కృతిక రంగ ప్రముఖులు ఉప్పాల సతీష్‌బాబు, సీహెచ్‌వీ ప్రసాద్‌కు కళా దీక్షితులు స్మారక పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. త్యాగరాయ గానసభ అధ్యక్షుడు వీఎస్ కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు గానసభ సంయుక్త కార్యదర్శి తాళ్ళపల్లి చక్రపాణి, గానసభ పాలకమండలి సభ్యురాలు గుండవరపు గీతాదేవి, లంకా లక్ష్మీనారాయయణ, జొన్నలగడ్డ జగన్ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చిక్కడపల్లి: ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని చిక్కడపల్లి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజు నాయక్ తెలిపిన వివరాలు ప్రకారం... గురువారం సాయంత్రం పోలీసులు పోలీసుస్టేషన్ పరిధిలోని జవహర్‌నగర్ వీధి ఫుట్‌పాత్‌పై ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. 108 అంబులెన్స్ సిబ్బంది పరిశీలించగా ఆ వ్యక్తి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడని తెలిపారు. మృతుడి ఒంటిపై ఎల్లో కలర్ చెక్స్‌షర్ట్, బ్లాక్ కలర్ ఫ్యాంటు ఉన్నాయని తెలిపారు. మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చరీకి తరలించారు. మృతుడిని గుర్తిస్తే పోలీస్‌స్టేషన్‌లో లేదా ఫోన్ నం. 87125 70380 తెలపాలని కోరారు.

సాయుధ రైతాంగ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య


దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ

ముషీరాబాద్: భూమి కోసం, భుక్తి కోసం, ఆత్మగౌరవం కోసం ప్రాణాలను వదిలిన గొప్ప నాయకుడు దొడ్డి కొమురయ్య అని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ అన్నారు. గురువారం ముషీరాబాద్‌లో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా హాజరై చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ముఠా జైసింహ మాట్లాడుతూ... ఆధిపత్య వ్యవస్థను కుక్కటివేళ్లతో పెకిలించిన ధీరుడని అన్నారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణకుమార్, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు బల్లా శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, టెంట్‌హౌస్ శ్రీనివాస్, వల్లాల శ్రీనివాస్‌యాదవ్, సాయిచాణిక్యరెడ్డి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



కవాడిగూడ: వేసవిలో పాదచారులు, వాహనదారులకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడుతాయని బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు ఎంఎన్ శ్రీనివాస్‌రావు అన్నారు. బీఆర్ఎస్ నేత తడకపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం కవాడిగూడ చిత్రాల నర్సింహులు ప్రభుత్వ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బీఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహతో కలిసిన ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటి రోజు దాదాపు 4వేల మందికి ఉచితంగా జ్యూస్ పంపిణీ చేశారు.

హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఉపసంహరించుకోవాలి

కవాడిగూడ: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం వేలం వేయడాన్ని ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ హెచ్చరించారు. గురువారం హెచ్‌సీయూ విద్యార్థులపై లాఠీచార్జ్, మూగజీవాలను కాపాడాలని జల్ జంగల్ జమిన్ ఉద్యమ స్ఫూర్తితో లోయర్ ట్యాంక్‌బండ్‌లోని బీఆర్ అంబేద్కర్ విగ్రహం నుంచి కోమురం భీం విగ్రహం వరకు కాగడాల ప్రదర్శన నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న భూముల రక్షణ కోసం బీజేవైఎం ముందు వరుసలో ఉంటుందన్నారు. హెచ్‌సీయూ భూములను ఎట్టా పరిస్థితిలో విక్రయించనివ్వమని అన్నారు. హెచ్‌సీయూ భూములపై జస్టిస్ గావాయి నేతృత్వంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రేవంత్రెడ్డి ప్రభుత్వానికి చెంపపెట్టులాంటిదని అన్నారు.

కంచ గచ్చిబౌలిని రిజర్వ్ ఫారెస్టుగా ప్రకటించాలి



చిక్కడపల్లి: కంచ గచ్చిబౌలి ఫారెస్టును రిజర్వ్ ఫారెస్టుగా ప్రకటించాలని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం సాయంత్రం ఆయన గాంధీనగర్‌లో మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు తల్లిలాంటి అడవిని కాపాడాల్సిన వారే చెట్లను నరికేయడం సరికాదన్నారు. 400 ఎకరాల్లో అరుదైన జంతువులతో పాటు పక్షులు ఉన్నాయన్నారు. వాటిని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

అణచివేత ధోరణిని చూస్తూ ఊరుకోం

ముషీరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములు 400 ఎకరాల భూమిని అమ్మకానికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకోవడాన్ని నిరసిస్తూ చలో సెక్రటేరియట్ నిర్వహిస్తున్న విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులను అరెస్ట్ చేయడాన్ని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ తీవ్రంగా ఖండిస్తోందని రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు అన్నారు. హెచ్‌సీయూలో విద్యార్థులు చేస్తున్న ఉద్యమాన్ని అణిచివేసేందుకు దుర్మార్గమైన రీతిలో లాఠీచార్జ్, అరెస్టులకు పూనుకుందన్నారు. ఈ అణచివేత ధోరణిని చూస్తూ ఊరుకోమన్నారు. హెచ్‌సీయూలో విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం హెచ్‌సీయూను పోలీసులు పహారాలో ఉంచడం సరికాదన్నారు. కాంగ్రెస్ సర్కార్ బీజేపీ లాగానే కార్పొరేట్ వర్గాల ప్రయోజనం చేస్తూ ప్రజా హక్కులను విస్మరిస్తోందన్నారు. అరెస్టు చేసిన విద్యార్థులను వెంటనే విడుదల చేయాలన్నారు.

కనీస వేతనాల జీఓను అమలు చేయాలి


జేసీఎల్ సునీతకు వినతి పత్రాన్ని అందజేస్తున్న యూనియన్ నేతలు

చిక్కడపల్లి: ఉస్మానియా విశ్వవిద్యాలయం హాస్టల్స్, మెస్‌లలో పనిచేసే కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాల జీఓను అమలు చేయాలని టీయూసీఐ అనుబంధ ప్రొగ్రెసివ్ కాంట్రాక్ట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ కోరారు. ఈ మేరకు గురువారం ఆర్టీసీ క్రారోడ్డులోని కార్మికశాఖ కమిషనర్ కార్యాలయంలో కార్మికశాఖ జంటనగరాల సంయుక్త కమిషనర్ సునీతకు వినతి పత్రాన్ని అందజేశారు.

◆ అనంతరం ఆమె మాట్లాడుతూ.. యూనియన్ ఆధ్వర్యంలో 2009 సంవత్సరంలో కేసు వేశామన్నారు. అప్పటి నుంచి గత నెల వరకు హైకోర్టులో కొనసాగిందన్నారు. మార్చి నెల 7న న్యాయస్థానం ఆర్డర్ జారీ చేసేందని, డిపాజిట్ చేసిన 50 శాతం డబ్బులను కేసు వేసిన ఉద్యోగులకు తక్షణమే చెల్లించాలని సంయుక్త కమిషనర్‌కు హైకోర్టు ఆదేశించిదన్నారు. సంయుక్త కమిషనర్ సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయ, పద్మ, విజయ, సావిత్రి పాల్గొన్నారు.

హజార్ గల్లీలో తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ముషీరాబాద్: ముషీరాబాద్ డివిజన్ హజార్ గల్లీ, సెయింట్ పాయిస్ స్కూల్ వీధిలో గత నెల రోజులుగా తాగునీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ పేర్కొన్నారు. జలమండలి అధికారులు ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం ప్రజల విజ్ఞప్తి మేరకు జలమండలి అధికారులతో కలిసి స్థానిక ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. నెల రోజులుగా తాగునీటి సరఫరా లేకపోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. కొత్త పైపులైన్ వేసి సమస్యను పరిష్కరించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ జలమండలి అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారన్నారు. త్వరితగతిన పైపులైన్ నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలు ఎదుర్కొంటున్న నీటి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్‌కుమార్, నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, తలారి శ్రీకాంత్‌ముదిరాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

